తెలుగు దినపత్రిక

సూర్యోదయ వార్త

ప్రతి అక్షరం ప్రజల కోసం...

తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి: 2 | సంచిక : 51 | మంగళవారం 17.11. 2026 | పేజీలు :4 | వెల: 2



యాక్ట్ ఈస్ట్ పాలసీకి ప్రాధాన్యం

- ఆసియాన్ సదస్సులో పాల్గొనేందుకు మనీలాకు ప్రధాని మోదీ
- భారత్-ఆసియాన్ సంబంధాల బలోపేతమే లక్ష్యం..
- నేడు రెండు కీలక అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొననున్న మోదీ
- మనీలాలో ప్రదాని మోదీకు ఘన స్వాగతం

తెలంగాణ పల్లెలకు డిజిటల్ వెలుగులు!

- ప్రతి ఇంటికీ హైస్పీడ్ ఇంటర్నెట్.. భారత్‌నెట్‌తో టీ-ఫైబర్‌కు కొత్త ఊపు
- కేంద్రం నుంచి రూ.3,185 కోట్ల నిధులు.. డిజిటల్ సేవలకు మార్గం సుగమం
- గ్రామీణ విద్యార్థులు, రైతులు, ప్రభుత్వ కార్యాలయాలకు మరింత ప్రయోజనం
- భారత్‌నెట్--టీ-ఫైబర్ మధ్య కీలక ఒప్పందం.
- మూడు జిల్లాల్లో ప్రయోగాత్మక అమలు.
- ఉమ్మడి కరీంనగర్‌లో 1,179 గ్రామ పంచాయతీలకు సేవలు.



హైదరాబాద్

తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ విప్లవానికి మార్గం సుగమమవుతోంది. ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ టీ-ఫైబర్ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. సవరించిన భారత్‌నెట్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ డిజిటల్ భారత్ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించనున్నారు. ఈ ఒప్పందంతో రాష్ట్రంలో టీ-ఫైబర్ నెట్‌వర్క్ విస్తరణకు ఎదురవుతున్న నిధుల సమస్యకు పరిష్కారం లభించనుంది. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలవుతున్న ఈ ప్రాజెక్టును రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. తెలంగాణలో గ్రామీణ ఇంటర్నెట్ సేవలను విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.3,185 కోట్ల - మిగతా3లో

తనఖా పెట్టిన ఇళ్ల పట్టాలు వెనక్కి!



- ఏడులక్షల మంది లబ్ధిదారులకు ప్రయోజనం
- పట్టాలు, పొజిషన్ ధ్రువపత్రాలు తిరిగి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం
- ఉమ్మడి రాష్ట్రంలో అమలైన పథకాల లబ్ధిదారులకు ఊరట
- అసలు పట్టాలు, పొజిషన్ ధ్రువపత్రాలను గుర్తించి తిరిగి అందించేలా అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ

హైదరాబాద్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అమలైన గృహ నిర్మాణ పథకాల కింద ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. గతంలో గృహ నిర్మాణ రుణాల కోసం తనఖా పెట్టిన ఇళ్ల పట్టాలు, పొజిషన్ ధ్రువపత్రాలను తిరిగి ఇవ్వాలని నిర్ణయించింది. రుణాలు పూర్తిగా చెల్లించినప్పటికీ వివిధ కారణాలతో ఇప్పటికీ తహసీల్దారు కార్యాలయాల్లోనే ఉండిపోయిన ఈ పత్రాలను లబ్ధిదారులకు అందజేయాలని అధికారులను ఆదేశించింది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు ఏడులక్షల మందికి ప్రయోజనం కలగనుంది. ఈ పథకాల అమలు సమయంలో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం సబ్సిడీతో పాటు లబ్ధిదారుల వాటా, బ్యాంకు రుణం రూపంలో ఆర్థిక సహాయం అందించేది. రుణం పొందే సమయంలో లబ్ధిదారులు తమ ఇళ్ల పట్టాలను భద్రతగా అధికారుల వద్ద తనఖా పెట్టేవారు. తీసుకున్న రుణాన్ని వాయిదాల రూపంలో పూర్తిగా చెల్లించిన తర్వాత ఆ పత్రాలను తిరిగి ఇవ్వాల్సి ఉండేది. అయితే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం పాత గృహ నిర్మాణ పథకాల అమలు నిలిచిపోవడం, - మిగతా3లో



యుద్ధ వేళ విదేశాలపై ఆధారపడే పరిస్థితి ఉండకూడదు!

- స్వదేశీ ఆయుధాలే భారత రక్షణకు అసలైన బలం
- ఆత్మనిర్భరతే యుద్ధ సంసిద్ధతకు పునాది
- ఆపరేషన్ సిందూర్‌తో స్వదేశీ ఆయుధాల సత్తా నిరూపణ
- చైనా కదలికలపై నిరంతర నిఘా.. ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు సిద్ధం

కుటుంబంపై ప్రచారమైన అసత్యాలకు నా ఆత్మకథే సమాధానం!

- మా కుటుంబంపై ఎన్నో అవాస్తవ కథనాలు అల్లారు!
- వాటికి సమాధానంగానే ఆత్మకథ రాశా: సోనియా గాంధీ
- 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకావిష్కరణ
- రాహుల్, ప్రియాంక సమక్షంలో ఘనంగా కార్యక్రమం



అక్రమాలకు అడ్డుకట్ట ఎప్పుడు?

సరిహద్దులు దాటుతున్న రేషన్ బియ్యం!
పేదల బియ్యంపై అక్రమార్కుల కన్ను



- కార్డుదారుల నుంచి కిలో రూ.10కే కొనుగోలు
- పట్టణ ప్రాంతాల్లో డీలర్ల ఇష్టారాజ్యం
- బినామీల ద్వారా రేషన్ దుకాణాల నిర్వహణ
- లారీల్లో మహారాష్ట్ర, కర్ణాటకకు తరలింపు
- ఇథనాల్ పరిశ్రమలకు బియ్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలు
- జీపీఎస్ నిఘా ఉన్నా ఆగని అక్రమ రవాణా

హైదరాబాద్

పేదలకు అందించాల్సిన ప్రభుత్వ రేషన్ బియ్యం అక్రమార్కుల చేతుల్లోకి వెళ్తోంది. చౌకధరల దుకాణాల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని కొందరు డీలర్లు పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కార్డుదారుల నుంచి తక్కువ ధరకు బియ్యం సేకరించి, భారీ మొత్తాలకు ఇతర రాష్ట్రాల్లో విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సంగారెడ్డి జిల్లా, జహీరాబాద్ ప్రాంతాల్లో వెలుగుచూస్తున్న ఘటనలు ఈ అక్రమ వ్యాపారం తీవ్రతను బయటపెడుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లోని కొందరు రేషన్ - మిగతా3లో



ఎస్ఐఆర్‌పై ఈసీని నిలదీసేందుకు అనుమతించండి!

- సుప్రీంకోర్టును ఆశ్రయించిన రాహుల్‌గాంధీ సహా విపక్ష నేతలు
- 48 ప్రశ్నలతో ప్రశ్నావళి సమర్పణ
- ఓటర్ల తొలగింపు, ఈసీ నిర్ణయాలపై వివరణ కోరిన నేతలు
- ఈ నెల 17న మరోసారి విచారణ

విద్యుత్ కోతలకు తావుండకూడదు!

- డిమాండ్‌కు అనుగుణంగా ముందస్తు ఏర్పాట్లు చేయాలి
- అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు
- రబీ సీజన్‌లో రైతులు, ప్రజలకు నిరంతర విద్యుత్
- రికార్డు స్థాయికి చేరిన విద్యుత్ డిమాండ్
- గతేడాదితో పోలిస్తే భారీగా పెరిగిన వినియోగం
- జలవిద్యుత్ ఉత్పత్తిలో 4 వేల మెగావాట్ల లోటు



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. రబీ సీజన్‌లో రైతులు, ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ అందించాలని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో అక్టోబరు 16న రికార్డు స్థాయిలో 20,018 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ - మిగతా3లో

ఇంధన ధరల సెగ.. టోకు ద్రవ్యోల్బణం 12.29 శాతానికి!

వరుసగా మూడో నెలా పెరుగుదల.. ముడి చమురు, విద్యుత్ ధరల ప్రభావం

మినరల్ ఆయిల్స్‌లో 45.57 శాతం ద్రవ్యోల్బణం.. సామాన్యులపై ధరల భారం పడే అవకాశం



పాక్ చేతికి లక్ష ఎఫ్‌పీవీ డ్రోన్లు!

- తుర్కియేతో మూడేళ్ల భారీ ఒప్పందం..
- స్వదేశంలోనే తయారీ కేంద్రాల ఏర్పాటు
- ఆపరేషన్ సిందూర్ తర్వాత ఆయుధ సంపత్తి పెంపుపై పాక్ దృష్టి
- నిఘా నుంచి దాడుల వరకు.. యుద్ధరంగంలో డ్రోన్లదే కీలక పాత్ర

తెలుగు దినపత్రిక
సూర్యోదయ వార్త
ప్రతి అక్షరం ప్రజల కోసం...

నేతాజీ పరాక్రమ చైతన్య యాత్రను జయప్రదం చేయండి

నేతాజీని స్మరించుకుందాం -- దేశాన్ని రక్షించుకుందాం

లోక్ రక్షక్ పార్టీ వ్యవస్థాపకులు కొండా చరణ్



చర్ల, 2026నవంబర్ 16,సూర్యోదయవార్త న్యూస్ :
చర్ల మండలంలో నిర్వహించిన లోక్ రక్షక్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పార్టీ వ్యవస్థాపకులు కొండా చరణ్ మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అపారమైన ధైర్యసాహసాలు ప్రదర్శించి, దేశంకోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. నేతాజీ కేవలం ఒక స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమే కాదని,ఆయన దేశభక్తి, ధైర్యం,త్యాగం,క్రమశిక్షణ, నిస్వార్థ సేవలకు నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. ఆజాద్ హింద్ ఫౌజ్ ద్వారా స్వాతంత్ర్యం కోసం ఆయన సాగించిన పోరాట చరిత్రను నేటి యువతకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఈ లక్ష్యంతో లోక్ రక్షక్ పార్టీ ఆధ్వర్యంలో 2026 నవంబర్ 23 నుంచి 2027 జనవరి 23 వరకు రెండు నెలల పాటు “నేతాజీ పరాక్రమ చైతన్య యాత్ర” నిర్వహించనున్నట్లు ప్రకటించారు.ఈ యాత్రలో భాగంగా వివిధ ప్రాంతాల్లో సభలు,సమావేశాలు నిర్వహించి నేతాజీ జీవిత చరిత్ర,ఆజాద్ హింద్ ఫౌజ్ పోరాట చరిత్ర,దేశభక్తి, త్యాగం,క్రమశిక్షణ,జాతీయ ఐక్యత వంటి అంశాలపై ప్రజలకు,ముఖ్యంగా యువతకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. యువతలో దేశంపట్ల బాధ్యత,సమాజం పట్ల సేవాభావం,అన్యాయాన్ని ఎదిరించే ధైర్యం పెంపొందించడమే ఈ యాత్ర ప్రధాన ఉద్దేశమని కొండా చరణ్ స్పష్టం చేశారు. నేతాజీ ఆశయాలను కేవలం ప్రసంగాలకే పరిమితం చేయకుండా,వాటిని మన జీవితాల్లో ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. 2027 జనవరి 23తేది నాడు నేతాజీ జయంతి సందర్భంగా పరాక్రమ్ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించి ఈ చైతన్య యాత్రను ముగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు,యువత, దేశభక్తులు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ఎస్.కె. జహూరుద్దీన్ భాష,పార్టీ మండల నాయకులు సిహెచ్.సుజాత,కూరపాటి స్వరూప,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

42 శాతం ఫిట్మెంట్తో పిఆర్సినీ వెంటనే అమలు చేయాలి...

(టీఎస్ టి డబ్ల్యూ టి యు) జిల్లా ప్రధాన కార్యదర్శి.- జబ్బా రవి

మంగపేట. ములుగు జిల్లా. నవంబర్ 16- (సూర్యోదయ వార్త .)



తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగులకు ఇవ్వవలసిన రెండవ పి.ఆర్.సిని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొంటే ఎన్మో ప్రయోగిస్తామని అప్పటి ప్రభుత్వం బెదిరించిన లెక్కచేయకుండా పెన్ డౌన్, చాక్ డౌన్ లాంటి ఉద్యమాలు చేయడమే కాకుండా సకల జనుల సమ్మెలో ప్రత్యక్షంగా పాల్గొని తెలంగాణ ప్రజలకు తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించి చైతన్యపరచడంలో ఉద్యోగుల పాత్ర చాలా ఉన్నతమైనదని అన్నారు. కోరి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో మొదటి పిఆర్సి ని 33 నెలల తర్వాత ప్రకటించినారు. ప్రస్తుతము రెండో పిఆర్సి అంతకుమించి -అన్న చందంగా 40 నెలలు పూర్తి చేసుకున్నప్పటికీ నేటికి వేతన సవరణ సంఘం (పిఆర్సి)నివేదిక ప్రభుత్వానికి అందకపోవడం శోషనీయంగా ఉందన్నారు. రాజ్యాంగబద్ధంగా రావలసిన పిఆర్సిని ఇవ్వడానికి ప్రభుత్వానికి ఇంకా మనసు రాకపోవడం ఉద్యోగస్తులు ఇబ్బంది పెట్టడమే తప్ప మరేది కాదని, ఇప్పటికైనా పిఆర్సి నివేదికను వెంటనే తెప్పించుకుని 42% ఫిట్మెంటుతో పిఆర్సినీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టాల్సి వస్తుందని హెచ్చరించారు...

కార్తీక మాసం తొలి సోమవారం.. శివాలయాల్లో భక్తిశ్రద్ధలతో అభిషేకాలు.

భస్మాభిషేకంతో భక్తులకు దర్శనమిచ్చిన ఉమారామలింగేశ్వరుడు.





భద్రాచలం, నవంబర్ 16.(సూర్యోదయ వార్త).
శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయాలైన శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామివారి ఆలయం, శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామివారి ఆలయం (శివాలయం)లో కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదమంత్రోచ్ఛారణల నడుమ శ్రీ స్వామివారికి విశేష అభిషేకాలు, భస్మాభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణలు, పూజలు చేపట్టారు. హిందూ సంప్రదాయంలో కార్తీక మాసానికి అత్యంత విశిష్టమైన స్థానం ఉంది. ఈ మాసం పరమశివుడికి, అత్యంత ప్రీతికరమైన మాసంగా భక్తులు భావిస్తారు. ముఖ్యంగా కార్తీక సోమవారాలు శివారాధనకు విశేష పుణ్యప్రదమైన రోజులుగా ప్రసిద్ధి చెందాయి. ఈ మాసంలో శివనామస్మరణ, అభిషేకాలు, దీపారాధన, ఉపవాసాలు, నదీస్నానాలు చేయడం వల్ల ఆధ్యాత్మిక చింతన, మానసిక ప్రశాంతత కలుగుతాయని భక్తుల విశ్వాసం. అదేవిధంగా భస్మాభిషేకానికి శైవ సంప్రదాయంలో ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. భస్మం మానవ జీవితంలోని అనిత్యతను, అహంకారాన్ని విడిచిపెట్టి పరమాత్మను స్మరించుకోవాల్సిన ఆధ్యాత్మిక సత్యాన్ని తెలియజేస్తుంది. భస్మం శివతత్వానికి ప్రతీకగా భావించబడుతుంది. భస్మాభిషేకం ద్వారా శివుని అనుగ్రహం పొందవచ్చని భక్తులు విశ్వసిస్తారు. కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని శ్రీ స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణాలు శివనామస్మరణతో భక్తిమయంగా మారాయి.

గోగుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం..

- **రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం..**
- **రైతులకు అండగా నిలుస్తూ మద్దతు ధర అందిస్తున్న ప్రభుత్వం --**
- **ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు..**

ఏటూరునాగారం, నవంబర్ 16:. (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)



రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజకు గిట్టుబాటు ధర కల్పించి, వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడటమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు అన్నారు. మంత్రి ధనసరి అనసూయ సీతక్క., ములుగు జిల్లా డీసీసీ అధ్యక్షులు పైడాకుల అశోక్ నాయకత్వంలో ఏటూరునాగారం మండలం గోగుపల్లి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు, పీఏసీఎస్ చైర్మన్ కునూరు అశోక్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా చిటమట రఘు మాట్లాడుతూ రైతులు ఎంతో శ్రమించి పండించిన ధాన్యాన్ని దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి న్యాయమైన మద్దతు ధర పొందాలని సూచించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సన్నవడ్లు గ్రేడ్-ఏ రకానికి క్వింటాల్కు రూ.2,461, దొడ్డువడ్లు గ్రేడ్-బీ రకానికి క్వింటాల్కు రూ.2,441 మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు..కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, ఇతర అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని సంబంధిత అధికారులు, నిర్వాహకులకు సూచించారు. రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, రైతుల సంక్షేమం వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు.పీఏసీఎస్ అధ్యక్షుడు కునూరు అశోక్ గౌడ్ మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రైతుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తుందని, రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని కోరారు..ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దేవులపల్లి విజయ్ కుమార్, ఆర్టీఏ డైరెక్టర్ వసంత శ్రీనివాస్, మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చేల వినయ్, మండల ఆత్మ కమిటీ డైరెక్టర్ దుబ్బాక రాకేష్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వంగపండ్ల రవి, శివాపురం ఉపసర్పంచ్ వంగపండ్ల సరిత, ముక్కెర లాలయ్య, వార్డు సభ్యులు ముమ్మనేని రమేష్, వావిలాల చిన్న ఎల్లయ్య, సరికొప్పుల శ్రీనివాస్, సర్వ అక్షిత్, పోలెబోయిన గోపాల్, కే. రంజిత్, తూర్పాటి కుమార్ స్వామి, మండల యువజన అధ్యక్షుడు తాగూర్, గద్దరాజు, మల్లారెడ్డి, ఇతర మండల నాయకులు, రైతులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ న్యూ డెమోక్రసీ వినతి

చర్ల, 2026నవంబర్ 16,సూర్యోదయవార్త న్యూస్ :



చర్ల మండలం చిన్నమిడిసిలేరు గ్రామంలో పెసా గ్రామసభ నిర్వహించకుండా, గిరిజనుల సంతకాలు, తీర్మానం లేకుండా తరతరాలుగా సాగు చేసుకుంటున్న పోడు భూముల్లో అక్రమంగా మొక్కలు నాటిన ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో అటవీహక్కుల చైర్మన్ పొడెం వీరయ్యకి వినతి పత్రం అందజేయడం జరిగింది.
ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ ముసలి సతీష్,చర్ల మండల కార్యదర్శి కామ్రేడ్ సంతపూరి సురేష్ మాట్లాడుతూ
చిన్నమిడిసిలేరు గ్రామంలో గిరిజనులను ఫారెస్ట్ అధికారులు రెండు వర్గాలుగా విడదీసి,ఒక వర్గానికి మాత్రమే పట్టాలు ఇచ్చి మరో వర్గానికి అన్యాయం చేశారని ఆరోపించారు.
2019లో పోడుసర్వే చేసే సమయంలో చంద్రుగొండ మండలం ఎర్రబోడు గ్రామంలో గిరిజనులకు, ఫారెస్ట్ అధికారులకు మధ్య వాగ్వాదం జరిగి,ఒక గిరిజనుడు రేంజర్ను నరికి చంపిన ఘటన జరిగిందని, ఆ ఘటనను సాకుగా చూపి అప్పటి నుండి చిన్నమిడిసిలేరులో పోడు సర్వేను నిలిపివేశారని, దీనివల్ల తమకు పట్టాలు రాలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే తమ పోడు భూముల సర్వే చేయాలని డిమాండ్ చేశారు.
ఐదవ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతంలో పెసా చట్టం ప్రకారం గ్రామసభ అనుమతి తప్పనిసరని, కానీ గ్రామసభ పెట్టకుండా పోడు భూముల్లో మొక్కలు నాటడం పెసా చట్టాన్ని, అటవీ హక్కుల చట్టం-2006ను ఉల్లంఘించడమేనని అన్నారు. ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ సర్వేచేసి రిపోర్ట్ పంపాలని ఆదేశాలు ఇస్తే, దానికి విరుద్ధంగా ఫారెస్ట్ అధికారులు పోడు రైతులను కేసులు పెడతాం, రేషన్ కార్డులు రద్దు చేస్తాం అంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు.వెంటనే ఆ మొక్కలను తొలగించి, బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.
దీనిపై చైర్మన్ పొడెం వీరయ్య సానుకూలంగా స్పందించి విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.లేని యెడల ఫారెస్ట్ అధికారులపై గిరిజనుల తిరుగుబాటు తప్పదని, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీగా హెచ్చరిస్తున్నామని అన్నారు.
ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ దుమ్ముగూడెం మండల కార్యదర్శి కామ్రేడ్ కొంజ జోగారావు,రామకృష్ణ, జానకి,వెంకటమ్మ, రామలక్ష్మి,తుర్రం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రెడ్క్రాస్ సేవల్లో మరో మైలురాయి.. డయాలసిస్ కేంద్రానికి శ్రీకారం

- **ఏజెన్సీ ప్రాంత కిడ్నీ వ్యాధిగ్రస్తులకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు - ఎల్.ఏ. తెల్లం వెంకటారావు శంకుస్థాపన**

భద్రాచలం, నవంబర్ 16: (సూర్యోదయ వార్త ప్రతినిధి).





ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఇండియన్ రెడ్క్రాస్ సొసైటీ భద్రాచలం శాఖ మరో కీలక అడుగు వేసింది. రెడ్క్రాస్ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న డయాలసిస్ కేంద్రం భవనానికి ఆదివారం ఉదయం భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు శంకుస్థాపన చేశారు. భద్రాచలం పరిసర ప్రాంతాలతో పాటు మారుమూల గిరిజన గ్రామాల్లో కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న అనేకమంది రోగులు డయాలసిస్ చికిత్స కోసం ఖమ్మం, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. దీనివల్ల ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు ప్రయాణ ఖర్చులతో పాటు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో భద్రాచలంలోనే డయాలసిస్ కేంద్రం అందుబాటులోకి వస్తే ఏజెన్సీ ప్రాంత రోగులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. వైద్య నిపుణుల పర్యవేక్షణలో సాధారణ రుసుముతో డయాలసిస్ సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. కిడ్నీలు పూర్తిస్థాయిలో పనిచేయని రోగులకు డయాలసిస్ అత్యంత అవసరమైన ప్రాణాధార చికిత్స. వైద్యుల సూచన మేరకు వారానికి రెండు లేదా మూడు సార్లు ఈ చికిత్స చేయించుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో స్థానికంగానే డయాలసిస్ సేవలు అందుబాటులోకి రావడం వల్ల రోగులకు ప్రయాణ భారం తగ్గడంతో పాటు నిరంతర చికిత్స పొందేందుకు అవకాశం కలుగుతుంది.
ఇప్పటికే పలు వైద్య సేవలు. భద్రాచలం రెడ్క్రాస్ శాఖ రక్తదాన కార్యక్రమాలతో పాటు ప్రజారోగ్యానికి సంబంధించిన పలు సేవలను అందిస్తోంది. అత్యవసర సమయాల్లో రోగులకు రక్తం అందించేందుకు రక్తనిధి కేంద్రాన్ని నిర్వహిస్తోంది. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ప్రత్యేక వైద్య సహాయం, రక్తమార్పిడి సేవలు అందిస్తోంది. వారి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక వార్డును కూడా ఏర్పాటు చేసింది. అదేవిధంగా గిరిజన ప్రాంతాల్లో ప్రాధాన్యత కలిగిన సికిల్ సెల్ ఎనీమియా బాధితులకు వైద్య సేవలు, సహాయ కార్యక్రమాలు చేపడుతోంది. ఈ సేవలకు అదనంగా ఇప్పుడు డయాలసిస్ కేంద్రం నిర్మాణానికి శ్రీకారం చుట్టడం ద్వారా ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మరిన్ని వైద్య సదుపాయాలు అందించేందుకు రెడ్క్రాస్ శాఖ కృషి చేస్తోంది. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన గిరిజన కుటుంబాలకు స్థానికంగానే వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశం. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ జి.వి.వి. సుదర్శన్ రావు, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ భానుప్రసాద్, రాజారెడ్డి, ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ మోహన్ రావు, కార్యదర్శి రమేష్ చంద్ర, డాక్టర్ గీతా పావని, పట్టణ ప్రముఖులు, భద్రాచలం రెడ్క్రాస్ శాఖ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శంకరాజుపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ..

- **అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం -- దేవులపల్లి విజయ్ కుమార్..**
- **ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల అందజేత.**

ఏటూరునాగారం, నవంబర్ 16:(సూర్యోదయ వార్త. ప్రతినిధి)



ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరవేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, శంకరాజుపల్లి గ్రామ సర్పంచ్ దేవులపల్లి విజయ్ కుమార్ పేర్కొన్నారు..ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లి గ్రామపంచాయతీలో మండల పార్టీ అధ్యక్షులు ఉ శంకరాజుపల్లి సర్పంచ్ దేవులపల్లి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. రేషన్ కార్డులు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అనుసంధానమయ్యే ముఖ్యమైన గుర్తింపు పత్రమని పేర్కొన్నారు. గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తారని తెలిపారు. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి, గ్రామ అభివృద్ధికి నిరంతరం అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు.మంత్రి సీతక్క నాయకత్వంలో ములుగు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శంకరాజుపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు జాడి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి హసీనా బేగం, కారోబార్ వల్స సత్యం, మండల సహాయ కార్యదర్శి ఆత్మూరి ఎల్లయ్య, గ్రామ ఉపాధ్యక్షులు తీగల రమేష్, 9వ వార్డు సభ్యులు కొండగొర్ల నరేందర్, రొయ్యూర్ మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు కావిరి మొండయ్యతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

గం పోనిగూడెం రైతు వేదికలో మేట్ ఓరియంటేషన్ ప్రోగ్రాం

,మంగపేట, నవంబర్ 16- (సూర్యోదయ వార్త.)



– ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలోని గంపోని గూడెం రైతు వేదికలో సోమవారం వీబీజీ రామ్ జి పథకంపై ఏపిఓ అంకుష్ ఆధ్వర్యంలో అవగా హన కార్యక్రమం నిర్వహించారు.ఈ మేట్స్ అవగాహనా కార్యక్రమంకు ఎంపీడీఓ భద్రు నాయక్ హాజరైనారు.ఏపీఓ అంకుష్ వీబీజీ రామ్ జి పథకం అమలు మేట్స్ బాధ్యతలు చేయవలసిన పనులు విధులు తదితర అంశాలపై అవగాహనా కల్పించారు.ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ శిరీష, రాంబాబు,అనిల్ కుమార్,ఫీల్డ్ అసిస్టెంట్లు,25 గ్రామాల మేట్లు పాల్గొన్నారు.

ప్రతి కొండరెడ్డి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలి.

ఆదివాసి కొండరెడ్ల సంఘం డిమాండ్





భద్రాచలం నవంబర్ 16. (సూర్యోదయ వార్త).
జిల్లాలో నివసిస్తున్న అర్హులైన ప్రతి కొండరెడ్డి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఆదివాసి కొండరెడ్ల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘ వ్యవస్థాపక గౌరవ అధ్యక్షుడు ముర్ల రమేష్ ఆధ్వర్యంలో ఐటీడీఏ ఏపీఓ దేవిడ్ రాజ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముర్ల రమేష్ మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా కొండరెడ్డి ఆదివాసీలు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి కనీస వసతి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ అనేక కుటుంబాలు సరైన నివాస గృహాలు లేక జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని కొండరెడ్డి (పీవీటీజీ) కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి కొండరెడ్డి కుటుంబానికి వందశాతం అందేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా నివాస గృహాలు లేని ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గురుకుంట్ల బాబురెడ్డి, గోగుల మంగిరెడ్డి, కోపల చిన్నారెడ్డి, ఉప్పిశెట్టి రవీంద్రరెడ్డి, గోగుల సీతమ్మ, ఉప్పిశెట్టి విజయ్ రెడ్డి, మాడి కృష్ణరెడ్డి, బొల్లి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును బాధ్యతగా పరిష్కరించాలి.

ములుగు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు.

ములుగు. నవంబర్. 16 (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)
ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును అధికారులు బాధ్యతతో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులను స్వీకరించారు.అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలు 7, ఇందిరమ్మ ఇండ్లు 2, పింఛన్లు 4, ఇతర శాఖలకు సంబంధించినవి 9 కలిపి మొత్తం 22 దరఖాస్తులు అందాయి.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని సూచించారు. పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలపై జాప్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని, దరఖాస్తుల పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు అర్జీదారులకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, ఎం. సంపత్ రావు, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు...

ప్రభుత్వ జూనియర్ కళాశాల లో సమస్యలు పరిష్కరించాలి..

పిల్లల ప్రజావాణిలో సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ కు వినతి పత్రం.

అందజేసిన విద్యార్థులు..





ములుగు. నవంబర్ 16 (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)
ములుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు పలు సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాటిని వెంటనే పరిష్కరించాలని సోమవారం ములుగు కలెక్టరేట్ లో నిర్వహించిన పిల్లల ప్రజావాణిలో విద్యార్థులు ములుగు జిల్లా కలెక్టర్. బోర్క డే హేమంత్ సహదేవరావు కు వినతి పత్రం అందజేశారు. కళాశాలలో మౌలిక సదుపాయాలు. త్రాగునీటి వసతి. వసతి గృహాల సౌకర్యాలు కల్పించాలని కోరారు.

విద్యార్థులు కలెక్టర్ కు ఇచ్చిన వినతి పత్రం లో సమస్యలు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని విద్యార్థులు ఉదయం 8 గంటలకు కళాశాలకు వచ్చి సాయంత్రం ఐదు గంటల వరకు కళాశాలలో ఉండడంవల్ల మధ్యాహ్న భోజన సౌకర్యం ఏర్పాటు చేయాలని విద్యార్థులు కలెక్టర్ ని కోరారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వర్షాల వల్ల క్రీడా మైదానంలో నీరు నిలిచిపోతున్నాయని వాటి వలన ఇబ్బందికరంగా ఏర్పడుతుందని గ్రౌండ్లో మొరము (మట్టి) పోసి సదును చేసే ఆటలు కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.. విద్యార్థులు హాస్టల్ నుండి కళాశాలకు వెళ్లేటప్పుడు బస్సులు ఆపడం లేదంటూ ఎస్టీ హాస్టల్ జాకారం వద్ద బస్టాప్ ఏర్పాటు చేయాలని అలాగే. విద్యార్థులు ఎస్సీ హాస్టల్ కావాలని ఈ సంవత్సరం 2026 లో ఒక 30 అడ్మిషన్లు తిరిగి వెళ్ళిపోయాయని ఒక ఎస్సీ హాస్టల్లో ఏర్పాటు చేయాలని విద్యార్థులు ములుగు జిల్లా కలెక్టర్ బోర్క డే హేమంత్ సహదేవరావు కు వినతి పత్రం అందజేశారు.

భద్రాద్రి జిల్లాను బాలల స్నేహపూర్వక జిల్లాగా తీర్చిదిద్దాలి

- పిల్లల ప్రజావాణిలో పిల్లల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలి..
- బాలల నుంచి నేరుగా వినతులు స్వీకరించిన అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యచందన.

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 16 (సూర్యోదయ వార్త ప్రతినిధి):
ప్రతి చిన్నారి భద్రతకు భరోసా కల్పిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను సంపూర్ణ బాలల స్నేహపూర్వక జిల్లాగా తీర్చిదిద్దే దిశగా అధికారులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యచందన పిలుపునిచ్చారు. పిల్లల సమస్యలను పెద్ద మనసుతో వినడమే కాకుండా, వాటికి సకాలంలో పరిష్కారం చూపినప్పుడే బాలలకు నిజమైన రక్షణ కల్పించిన వారమవుతామని పేర్కొన్నారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక పిల్లల ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ముఖ్య అతిథులుగా పాల్గొని బాలబాలికల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిల్లల ప్రజావాణి అంటే కేవలం అర్జీలు తీసుకోవడం, ఫిర్యాదులు నమోదు చేయడం మాత్రమే కాదని, చిన్నారుల మనసులోని మాటను వినే వేదిక అని స్పష్టం చేశారు. పిల్లలు తమ సమస్యలను ఎలాంటి భయం, సంకోచం లేకుండా అధికారుల దృష్టికి తీసుకొచ్చే వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందన్నారు. అదనపు కలెక్టర్





వేణుగోపాల్ మాట్లాడుతూ.. ప్రతి చిన్నారి అభిప్రాయానికి విలువ ఇవ్వాలని, వారి అవసరాలు, సమస్యలు, ఆశయాలు, ఆకాంక్షలను గుర్తించి భవిష్యత్తుకు భరోసా కల్పించాలని అన్నారు. బాలల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని సూచించారు. అదనపు కలెక్టర్ విద్యచందన మాట్లాడుతూ.. బాలల కోణంలో వారి సమస్యలను అర్థం చేసుకున్నప్పుడే నిజమైన బాలల స్నేహపూర్వక పాలన సాధ్యమవుతుందని తెలిపారు. జిల్లాలో ఏ ఒక్క బాలుడు, బాలిక కూడా విద్యకు దూరం కాకూడదని, ఆరోగ్యం, పోషకాహారం, రక్షణ, సంక్షేమ పథకాలు ప్రతి చిన్నారికి అందాలని పేర్కొన్నారు. బాల కార్మికత్వం, బాల్యవివాహాలు, బాలలపై హింస, నిర్లక్ష్యం వంటి సమస్యల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి చిన్నారికి భద్రత, విద్య.. ప్రతి బాలికకు సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం ముందుకు సాగాలని అధికారులు ఆకాంక్షించారు. పిల్లల నుంచి స్వీకరించిన వినతులను సంబంధిత శాఖలకు పంపించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాలల హక్కుల పరిరక్షణలో అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె.ఎం. తార, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు ఎం.డి. సాధిక్ పాషా, ఎస్. సుమిత్రాదేవి, కె. అంబేద్కర్, బాలల సంరక్షణ అధికారి ఎం. హరికుమారి, నేషనల్ న్యూట్రిషన్ మిషన్ జిల్లా సమన్వయకర్త పొనుగోటి సంపత్, మహిళా సాధికారత జిల్లా సమన్వయకర్త సంతోషి రూప, డీసీపీయూ సిబ్బంది, చైల్డ్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

తాటి నీలాద్రికి శాలువాతో ఘన సన్మానం..

- కాంగ్రెస్ శ్రేణుల అభినందనలు!
- ఏటూరునాగారం మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఉ మీడియా ఇంచార్జిగా నూతన బాధ్యతలు..

ఏటూరునాగారం, నవంబర్ 16 (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)
ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఉ మీడియా ఇన్‌చార్జిగా నూతనంగా నియమితులైన తాటి నీలాద్రికి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు , కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్ ముఖ్య





అతిథులుగా హాజరై తాటి నీలాద్రికి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.– మంత్రి ధనసరి అనసూయ సీతక్క , ములుగు జిల్లా డీసీసీ అధ్యక్షులు పైడాకుల అశోక్ నాయకత్వంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేవులపల్లి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజా అభివృద్ధి కార్యక్రమాలను సోషల్ మీడియా వేదికగా ప్రతి ఒక్కరికీ చేరవేయడంలో నూతన బాధ్యతలు కీలకమని అన్నారు. పార్టీకి సంబంధించిన కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేస్తూ, యువతను పార్టీ వైపు ఆకర్షిస్తూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. తాటి నీలాద్రి తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీకి మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా తాటి నీలాద్రి తన నియామకానికి సహకరించిన మంత్రి సీతక్క , డీసీసీ అధ్యక్షులు పైడాకుల అశోక్ కి మండల అధ్యక్షులు దేవులపల్లి విజయ్ కుమార్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, గ్రామస్థాయి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మంగపేట వర్కింగ్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో జాతీయ పత్రికా దినోత్సవం..

మంగపేట, నవంబర్,16(సూర్యోదయ వార్త)
మంగపేట మండల కేంద్రంలో సోమవారం మంగపేట మండల వర్కింగ్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో జాతీయ పత్రికా దినోత్సవంను వర్కింగ్ జర్నలిస్టులు కేక్ కటింగ్ చేసినఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడు కటుకూరి సాంబశివరావు మాట్లాడుతూ సమాజంలోని ప్రతి అంశాన్ని వర్కింగ్ జర్నలిస్టులు గమనిం చాలని సామాన్య ప్రజానీకం ఎదుర్కొంటు న్న సమస్యలపై వార్త రూపంలో పోరాటం చేయాలని అన్నారు. అంతేకాకుండా విలువలతో కూడిన జర్నలిజం చేయాలని అన్నారు.మండలంలోని ప్రతి గ్రామ సమస్యను వెలుగులోకి తీసుకొచ్చి మండల అభివృద్ధికి



దోహదం చేస్తున్న జర్నలిస్టులందరికీ ఈ సందర్భంగా జాతీయ పత్రికా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. వర్కింగ్ జర్నలిస్ట్ జనరల్ సెక్రెటరీ ఇప్పలపల్లి రమేష్ మాట్లాడుతూ.పత్రికా రంగంలో ఎదురవుతున్న సమస్యలు,గ్రామీణ ప్రాంత జర్నలిస్టుల సంక్షేమం,ప్రెస్ స్వేచ్ఛ పరిరక్షణపై చర్చించారు.మంగపేట లాంటి మారుమూల మండలంలో ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో స్థానిక జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలక మని,పత్రికా స్వేచ్ఛను కాపాడుకుంటూ, బాధ్యతాయుతమైన జర్నలిజం కొనసాగిం చాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారులు ధర్మపురి శ్రీనివాస్, పోలసాని శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి ఉగ్గుమల్ల గణేష్,ప్రచార కార్యదర్శి తాళ్లూరి మధుకర్, అలాగే సంఘ సభ్యులు ఈసంపల్లి సురేందర్, స్నేహ కుమార్,గద్దం ప్రశాంత్,అజరుద్దీన్, యాసం హరీష్,కోడెం నరేష్,బోడ ప్రవీణ్, నూతి వెంకటేశ్వర్లు, తులసి,చల నవీన్, పాల్గొన్నారు.

ఎస్జిఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడల్లో మెరిసిన తిమ్మంపేట విద్యార్థి..

వాలీబాల్ పోటీలలో ప్రథమ స్థానం..

మంగపేట, నవంబర్ 16- (సూర్యోదయ వార్త)
ములుగు జిల్లా మంగపేట మండలం తిమ్మంపేట గ్రామానికి చెందిన ఎగ్గడి అర్జున్ – స్వప్న దంపతుల కుమారుడు ఎగ్గడి నాగచైతన్య మణుగూరు గ్రేస్ మిషన్ స్కూల్ లో 8వ తరగతి చదువుతున్నాడు.70వ ఎస్జిఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడల్లో రంగారెడ్డి జిల్లాలో జరిగిన వాలీబాల్ పోటీలలో పాల్గొని ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. చదువుతో పాటు అతనికి చిన్నతనం నుండి వాలీబాల్ అంటే చాలా ఇష్టం. దాంతో తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు ప్రోత్సాహం ఇవ్వడంతో అతనికి అండగా నిలబడ్డారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో వాలీబాల్ లో





అద్భుతమైన ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానానికి ఎంపికయ్యాడు.గ్రామానికి గర్వకారణంగా నిలిచిన నాగచైతన్య విజయం ఎంతో అభినందనీయం. భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, జాతీయస్థాయి పోటీలకు ఎంపికై గ్రామానికి మంచి పేరు తేవాలని గ్రామస్తులు కోరు కుంటున్నారు. నాగచైతన్యకు గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు, మిత్రులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

పదోన్నతి పొందిన సివిల్ ఎస్ఐ పగిడిపెల్లి ఓం ప్రకాష్..

జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘన సన్మానం.

మంగపేట: నవంబర్ . 16- (సూర్యోదయ వార్త)
ములుగు జిల్లా మంగపేట మండలం బిక్షంపేట గ్రామానికి చెందిన మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన పగిడిపెల్లి వెంకటేశ్వర్లు. కుమారుడు పగిడిపెల్లి ఓం ప్రకాష్. పోలీస్ శాఖలో అంచెలంచెలుగా ఎదుగుతూ ఇటీవల సివిల్ సబ్ ఇన్స్పెక్టర్‌గా పదోన్నతి పొందడం అభినందనీయమని జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ ఉ యూత్ ప్రతినిధులు పేర్కొన్నారు.కొన్ని సంవత్సరాలుగా కొత్తగూడెంలో ఏఆర్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ, తన క్రమశిక్షణ, అంకితభావంతో ఇటీవల సివిల్ ఎస్ఐగా పదోన్నతి పొందిన ఓం ప్రకాష్ కి మంగపేటలో జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ ఉ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా శాలువాతో సన్మానం చేసి అభినందనలు తెలియజేశారు.త్వరలో భూపాలపల్లి ప్రాంతంలో సివిల్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించనున్న ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ట్రస్ట్ సభ్యులు



ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్ మాట్లాడుతూ, ఒక మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చి కష్టపడి పోలీస్ శాఖలో ఉన్నత స్థాయికి ఎదగడం యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని, ప్రతిభను గుర్తించి గౌరవించడం జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు కోడెల నరేష్ , ప్రధాన కార్యదర్శి బండపల్లి రవి గౌడ్ , ప్రచార కార్యదర్శులు మహమ్మద్ కాజా. గగ్గురి మహేష్ , కార్యదర్శి పుణ్ణం భాస్కర్., ట్రస్ట్ గౌరవ సభ్యులు గార్లపాటి రాంబాబు , వనమాల సతీష్ , ములకల శ్రీను. చల్లా రాంకీ. తదితరులు పాల్గొన్నారు..



ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు అంతం లేదా?

- రాప్తాడు, జూలూరుపాడు ఘటనలపై ఏఎండీఆర్ ఫౌండేషన్ ఆదిల్ ఆగ్రహం
- మహిళల భద్రతపై ప్రభుత్వాలు సమాధానం చెప్పాలి
- ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా నిందితులకు కఠిన శిక్షలు విధించాలి



కొత్తగూడెం (సూర్యోదయ వార్త)

తెలుగు రాష్ట్రాల్లో మహిళలు, బాలికలు, విద్యార్థినులపై వరుసగా జరుగుతున్న దాడులు, హత్యలపై ఏఎండీఆర్ ఫౌండేషన్ ఆదిల్ తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలోని రాప్తాడులో పాఠశాల విద్యార్థిని, తెలంగాణలోని జూలూరుపాడులో నర్సింగ్ విద్యార్థిని హత్య ఘటనలు సమాజాన్ని కలచివేశాయని అన్నారు. ఆడపిల్లలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వాలు, పోలీసు వ్యవస్థలు మరింత బాధ్యతగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. కఠినమైన చట్టాలు ఉన్నప్పటికీ మహిళలపై నేరాలు తగ్గకపోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. నేరాలు జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా కేసుల విచారణ వేగవంతం చేసి, నిందితులకు కఠిన శిక్షలు విధించాలని, బాధిత కుటుంబాలకు త్వరితగతిన న్యాయం అందించాలని కోరారు. ఆడపిల్లల భద్రత సమాజం మొత్తం బాధ్యతని, బాధితులను ప్రశ్నించే ధోరణికి స్వస్తి పలికి నేరస్థులను నిలదీయాలని అన్నారు. ప్రతి ఆడపిల్ల భయంలేకుండా చదువుకునే, స్వేచ్ఛగా జీవించే వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వాలు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా కృషి చేయాలని ఆదిల్ పిలుపునిచ్చారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఉచిత జీవిత బీమా.

- కాంగ్రెస్ ప్రభుత్వ చారిత్రాత్మక నిర్ణయం!
- నవంబర్ 19 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రారంభం

ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు..



ఏటూరునాగారం. నవంబర్ 16 (సూర్యోదయ వార్త. ప్రతినిధి)

తెలంగాణలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనుంది. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల ఉచిత జీవిత బీమా సౌకర్యం కల్పించనున్నారు. కులం, మతం, ఆదాయంతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ పథకం వర్తిస్తుంది.

– పథకం ముఖ్య వివరాలు.

– . రూ. 5 లక్షల ఉచిత బీమా:

– కుటుంబంలో బీమా పొందిన వ్యక్తి మరణిస్తే నామినీలకు రూ. 5 లక్షల బీమా పరిహారం అందుతుంది. ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. లబ్ధిదారులు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు.

– అర్హతలు..

తెలంగాణలో నివసించే కుటుంబాలు అర్హులు. రేషన్ కార్డు లేదా ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలి. బీమా పొందే వ్యక్తి వయస్సు 18 నుంచి 59 ఏళ్ల మధ్య ఉండాలి. వయస్సు నిర్ధారణకు ఆధార్‌లోని పుట్టిన తేదీని పరిగణనలోకి తీసుకుంటారు.

బీమా ఎవరిపేరు మీద?:

కుటుంబంలో సంపాదించే వ్యక్తి ఒక్కరే ఉంటే వారి పేరు మీద, ఒకరి కంటే ఎక్కువ మంది సంపాదిస్తుంటే కుటుంబ సభ్యుల నిర్ణయం మేరకు ఒకరిని ఎంపిక చేసుకోవచ్చు.

నామినీ ఎంపిక:

ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మందిని నామినీలుగా ఎంపిక చేసుకోవచ్చు. బీమా మొత్తంలో ఎవరికెంత వాటా ఇవ్వాలో కూడా నమోదు చేయవచ్చు..

. నమోదు ఎక్కడ?:

నవంబర్ 19, 2026 నుంచి గ్రామాలు, పట్టణ వార్డుల్లో ప్రత్యేక నమోదు శిబిరాలు నిర్వహించనున్నారు. నవంబర్ 17, 18 తేదీల్లో దండోరా ద్వారా శిబిరాల వివరాలు తెలియజేస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు.

- అవసరమైన పత్రాలు:

– బీమా పొందే వ్యక్తి, నామినీల ఆధార్ కార్డులు.– రేషన్ కార్డు లేదా స్మార్ట్ ఎఫ్ఎస్‌సీ కార్డు.– ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్.– కుటుంబ సభ్యుల వివరాలు.

- . నమోదు సమయంలో జాగ్రత్త:

– పేర్లు, వయస్సు, నామినీ వివరాలు, వాటాల శాతాన్ని సరిచూసుకున్న తర్వాతే సంతకం లేదా వేలిముద్ర వేయాలి.

బీమా క్లెయిమ్..

– బీమా పొందిన వ్యక్తి మరణించినప్పుడు సంబంధిత అధికారుల ద్వారా క్లెయిమ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. మరణ ధ్రువీకరణ పత్రం, నమోదు రసీదు, నామినీ ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు అవసరం.

ప్రజలకు ముఖ్య విజ్ఞప్తి

ఈ పథకానికి ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. నమోదు పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే నమ్మవద్దు. అధికారిక నమోదు శిబిరాల్లో మాత్రమే వివరాలు నమోదు చేసుకోవాలి.ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా.. ప్రతి ఇంటికి జీవిత బీమా.. ఇదే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం లక్ష్యం!

– చిటమట రఘు.

ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్..

నేడు మంగపేట మండలం కేంద్రంలో మంత్రి సీతక్క పర్యటన..

నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమం.

మంగపేట. ములుగు జిల్లా. నవంబర్ 16



తెలంగాణ రాష్ట్ర మంత్రి . డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) మంగపేట మండలంలో నూతన చేయూత పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నారు.నవంబర్ 17, మంగళవారం కార్యక్రమ వివరాలు: మధ్యాహ్నం 3:00 గంటలకు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,మంగపేట సాయంత్రం 4:00 గంటలకుజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,రాజుపేట లో నిర్వహిస్తున్నట్లు సమాచారం. మంగపేట మండలంలోని రాష్ట్ర నాయకులు,జిల్లా నాయకులు,బ్లాక్ కాంగ్రెస్ నాయకులు,మహిళా నాయకురాళ్లు,యువజన కాంగ్రెస్ నాయకులు,పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంత చేయాలని మంగపేట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు. శెట్టిపల్లి వెంకటేశ్వర్లు కోరారు..

అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థిని అంకిత..

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐటీడీఏ ఏటూరునాగారం పరిధిలో అంకితకు ప్రథమ స్థానం
- ఏ జి హెచ్ ఎస్ చిరుతపల్లి--2 పాఠశాలకు కు గర్వకారణం..
- మ్యూజియం, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణపై అద్భుత ప్రదర్శన..

వెంకటాపురం. నూగూరు. ములుగు జిల్లా. నవంబర్ 16 (సూర్యోదయ వార్త.)

ములుగు జిల్లా వెంకటాపురం మండలం బర్లగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల,. ఏ జి హెచ్ ఎస్ చిరుతపల్లి--2 కు చెందిన పదవ తరగతి విద్యార్థిని అంకిత ఆర్ట్ అండ్ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఐ టి డి ఎ ఏటూరు నాగారం ఆధ్వర్యంలో నిర్వహించిన క్లబ్ యాక్టివిటీస్‌లో భాగంగా,"మూసేమ్ రెస్టిట్యూషన్ ఁ కల్చరల్ హెరిటేజ్ రేట్రీవలం " (మ్యూజియం, సాంస్కృతిక వారసత్వ పునరుద్ధరణ – తిరిగి పొందడం) అనే అంశంపై





అంకిత చేసిన చక్కని ప్రజెంటేషన్ అందరినీ ఆకట్టుకుంది.ఈ పోటీలలో డివిజనల్ స్థాయి, జోనల్ స్థాయిలను అధిగమించి జిల్లా స్థాయిలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రథమ స్థానాన్ని సాధించడం విశేషం. ఈ సందర్భంగా ఐ టి డి ఎ ప్రాజెక్టు అధికారి శ్రీ లెనిన్ వత్సల్ టోప్పో డివ్యూటీ డైరెక్టర్. జనార్దన్ చేతుల మీదుగా అంకితకు మెమెంటో అందించి ఘనంగా సన్మానించారు.ఈ విజయం వెనుక పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు కె. ఉష ప్రోత్సాహం, మార్గదర్శక ఉపాధ్యాయులైన పి. సుజన్ కుమార్, శైలజ, నవీన్, వినోద . సంధ్య రాణి., సహకారం ఎంతో ఉంది.ఆర్ట్ అండ్ కల్చరల్ క్లబ్ అనేది విద్యార్థుల్లో దాగి ఉన్న కళాత్మక ప్రతిభను వెలికితీయడం, సృజనాత్మక ఆలోచనలను పెంపొందించడం, మన దేశ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, కళలు వారసత్వ సంపదపై అవగాహన కల్పించడం వంటి లక్ష్యాలతో పనిచేస్తుంది. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, భావవ్యక్తీకరణ నైపుణ్యాలను అభివృద్ధి చేస్తాయి.అంకిత సాధించిన ఈ విజయం పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తోటి విద్యార్థులకు గర్వకారణంగా నిలిచింది. భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలు సాధించాలని ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బృందం పాఠశాల సిబ్బంది అంకితను అభినందించారు...

బీసీ భవనం మంజూరు చేసిన సీఎం మంత్రి సీతక్క,మంత్రి ప్రభాకర్‌కు క్షీరాభిషేకం

మంగపేట. ములుగు జిల్లా. నవంబర్. 16 (సూర్యోదయ వార్త)

మంగపేట మండల – కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో బీసీ సెల్ మండల అధ్యక్షులు ముత్తినేని ఆదినారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల కేంద్రంలో బీసీ భవన నిర్మాణం కోసం రూ.కోటి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలా భిషేకం చేసి కృతజ్ఞ తలు తెలియజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా



హాజరైన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మంత్రి సీతక్క ములుగు జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందు కు నిరంతరం కృషి చేస్తున్న ప్రజా నాయకు రాలని కొనియా డారు.ముఖ్యంగా బడుగు,బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరి గడపకు చేరేలా ముందుచూపుతో పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా,మండల,గ్రామ నాయకులు,మహిళా నాయకురాలు,యూత్ నాయకులు,వివిధ అనుబంధ సంఘాల నాయకులు, పాల్గొన్నారు..

అక్రమ నిర్మాణాలపై హైడ్రాకు ఫిర్యాదుల వెల్లువ

: హైదరాబాద్ నగరం, శివారు ప్రాంతాల్లో చెరువులు, నాలాలు, వరద కాలువల ఆక్రమణలు ఆందోళన కలిగిస్తున్నాయి. చెరువుల బఫర్ జోన్లలో నిర్మాణాలు చేపట్టి క్రమంగా ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలోకి చొచ్చుకెళ్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మరోవైపు వరద నీరు సాఫీగా వెళ్లాల్సిన నాలాలు, కాలువలను సైతం వదలకుండా ఆక్రమిస్తుండటంతో వర్షాకాలంలో తమ నివాస ప్రాంతాలు ముంపు బారిన పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనే అనేక చెరువులు ఆక్రమణలకు గురయ్యాయని, భవిష్యత్తులో మళ్లీ అక్రమ నిర్మాణాలు జరగకుండా చెరువులు, బఫర్ జోన్ల హద్దులను శాస్త్రీయంగా నిర్ధారించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని హైడ్రాను కోరుతున్నారు. రహదారుల ఆక్రమణలతో తమ ఇళ్లకు వెళ్లే దారులు మూసుకుపోతున్నాయని మరికొందరు ఫిర్యాదు చేశారు. ఇలా సోమవారం నిర్వహించిన హైడ్రా ప్రజావాణికి మొత్తం 54 ఫిర్యాదులు అందాయి. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. ఆయా ప్రాంతాలకు సంబంధించిన గూగుల్, శాటిలైట్ చిత్రాలను పరిశీలించి సమస్యల స్వరూపాన్ని అంచనా వేశారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి సంబంధిత సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు బాధ్యతలు అప్పగించారు.

4.20 ఎకరాల చెరువును కాపాడాలని వినతి..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అన్నోజీగూడలోని సర్వే నంబర్ 87లో ఉన్న 4.20 ఎకరాల చెరువును కాపాడాలని స్థానిక నివాసితులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. చెరువుకు ఆనుకొని నిర్మాణాలు చేపడుతున్నారని, దీంతో చెరువు విస్తీర్ణం క్రమంగా ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చెరువు హద్దులను అధికారికంగా నిర్ధారించి ఆక్రమణలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే ప్రాంతంలోని సర్వే నంబర్లు 90, 91లో దాదాపు ఆరు ఎకరాల ప్రభుత్వ భూమి కూడా ఆక్రమణకు గురయ్యే అవకాశం ఉందని, దానిని సైతం పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు.

నక్కవాగు నాలాకు ఆక్రమణల ముప్పు..

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామ శివారులోని సర్వే నంబర్లు 230, 231 పరిధిలో నక్కవాగు నాలాకు సంబంధించిన 1.17 ఎకరాల భూమిని ఆక్రమిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. నాలా భూమిని కబ్జా చేయకుండా అడ్డుకోవాలని కోరారు. అదే ప్రాంతంలో మరో 4.07 ఎకరాల ప్రభుత్వ భూమిలో లేఅవుట్ వేసి ప్లాట్లు విక్రయిస్తున్నారని ఆరోపించారు. నాలా ఆక్రమణలు, ప్రభుత్వ భూమిలో లేఅవుట్ వ్యవహారంపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని హైడ్రాకు విజ్ఞప్తి చేశారు.



నాలాపై ఆలయ విస్తరణతో ముంపు భయం..

ఎంఎంసీలోని కాప్రా సర్కిల్ పరిధిలోని శ్రీ సాయి ఎన్‌క్లేవ్‌లో నాలాపై ఆలయ నిర్మాణం చేపట్టడంతోపాటు దాని విస్తీర్ణాన్ని పెంచుతున్నారని శ్రీ సాయికృష్ణ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఈసీఐఎల్ ప్రాంతం నుంచి వర్షాకాలంలో పెద్దమొత్తంలో వరద నీరు ఈ నాలా ద్వారా ప్రవహిస్తుందని వివరించారు. నాలా ఆక్రమణకు గురైతే శ్రీ సాయి ఎన్‌క్లేవ్‌తోపాటు చుట్టుపక్కల నివాస ప్రాంతాలు ముంపు సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆలయ విస్తరణను నిలిపివేసి నాలా హద్దులను పరిరక్షించాలని కోరారు.

రాంపల్లిలో చెరువు బఫర్ జోన్‌లో నిర్మాణాలు..

ఎంఎంసీ ఉప్పల్ జోన్ పరిధిలోని ఘట్‌కేసర్ సర్కిల్ రాంపల్లి గ్రామం సర్వే నంబర్ 281లో ఉన్న పెద్ద చెరువు బఫర్ జోన్‌లో పెద్దఎత్తున నిర్మాణాలు జరుగుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. చెరువు బఫర్ పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్మాణాలను అడ్డుకోవడంతోపాటు చెరువు బఫర్ జోన్‌ను పరిరక్షించాలని కోరారు.

సాయిబాబా కాలనీలో రోడ్డు ఆక్రమణ..

గచ్చిబౌలి ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలోని సాయిబాబా కాలనీలో హైటెన్షన్ విద్యుత్ వైర్ల కింద షెడ్లు నిర్మించి ఆక్రమణలకు పాల్పడుతున్నారని కాలనీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా అక్కడి వరద కాలువను సైతం ఆక్రమించారని ఆరోపించారు. హైటెన్షన్ విద్యుత్ తీగల కింద నిర్మాణాలు చేపట్టకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని ఉల్లంఘిస్తున్నారని పేర్కొన్నారు. మరోవైపు రహదారిని ఆక్రమించడంతో కాలనీవాసులకు రాకపోకలు ఇబ్బందిగా మారాయని, రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లకు వెళ్లేందుకు దారి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణలను తొలగించి రహదారి, వరద కాలువను పునరుద్ధరించాలని హైడ్రాను కోరారు.

హిమాయత్‌సాగర్ పరిధిలో కాలుష్య కారక యూనిట్లు..

హిమాయత్‌సాగర్ పరిధిలోని వ్యవసాయ భూముల్లో సుమారు పది వరకు రెడీమిక్స్ కాంక్రీట్ (ఆర్ఎంసీ) యూనిట్లు ఏర్పాటు చేసి పరిసరాలను కాలుష్యానికి గురిచేస్తున్నారని పలువురు ఫిర్యాదు చేశారు. ఆయా యూనిట్లకు అవసరమైన అనుమతులు లేవని ఆరోపిస్తూ వాటిని తొలగించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. అలాగే మల్లంపేట, శంబీపూర్ గ్రామాల్లోని విశ్వవాణి చెరువును ఆక్రమణల నుంచి కాపాడాలని ప్రజావాణిలో విజ్ఞప్తి చేశారు.

గాజులరామారం చెరువులో పూడిక తీయాలి..

కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం గ్రామం సర్వే నంబర్ 127లోని చెరువులో పేరుకుపోయిన పూడికను తొలగించాలని స్థానిక నివాసితులు కోరారు. చెరువుకు సంబంధించిన ఇన్‌లెట్లు, ఔట్‌లెట్లు సరిగా పనిచేయడం లేదని, వాటిని మరమ్మతు చేసి నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. చెరువులోకి వచ్చే నీటి మార్గాలు, బయటకు వెళ్లే మార్గాలను పునరుద్ధరిస్తే నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతోపాటు పరిసర ప్రాంతాల్లో వరద సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు.

హద్దులు నిర్ణయించి ఫెన్సింగ్ వేయాలి..

హైడ్రా ఏర్పాటుతో పలు ప్రాంతాల్లో ఆక్రమణలు నిలిచిపోయినప్పటికీ భవిష్యత్తులో మళ్లీ అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా శాశ్వత రక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజావాణికి వచ్చిన పలువురు ఫిర్యాదుదారులు అభిప్రాయపడ్డారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను అధికారిక రికార్డులు, సర్వే ఆధారంగా నిర్ధారించి హద్దులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ముఖ్యంగా చెరువుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తే ఆక్రమణలకు అడ్డుకట్ట పడుతుందని సూచిస్తున్నారు. వరద కాలువలు, నాలాల ప్రవాహ మార్గాలను కూడా గుర్తించి ఎలాంటి అడ్డంకులు లేకుండా పరిరక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఒకవైపు చెరువులు, నాలాల ఆక్రమణలు, మరోవైపు ప్రభుత్వ భూముల కబ్జాలు, రోడ్లపై అక్రమ నిర్మాణాలు, కాలుష్య కారక యూనిట్లపై ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.